చివరి నిమిషంలో మోహన్‌లాల్ సిడ్నీ షో వాయిదా.. కారణమిదే! 3


# విజయ కెరటం
తెలుగు దిన పత్రిక






నల్గొండ | జులై 9 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 185 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్బుద్ అహ్మద్

NALGONDA | SUNDAY AUGUST 9 2026 | VOL:18 | ISSUE: 185 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed


## చర్చలకు సిద్ధం.. కానీ లొంగిపోయే ప్రసక్తే లేదు: ఇరాన్ అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు

- ఆంక్షలతో తమను లొంగదీసుకోలేరన్న ఇరాన్ అధ్యక్షుడు
- అణు కార్యక్రమం పేరుతో ఆంక్షలు విధిస్తున్నారని ఆగ్రహం
- ఆసియా దేశాలతో బంధం బలోపేతంపై దృష్టి పెట్టామన్న పెజెష్కియాన్

అమెరికా సహా పాశ్చాత్య దేశాలు విధిస్తున్న ఆర్థిక, దౌత్యపరమైన ఆంక్షలపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా స్పందించారు. శాంతియుత చర్చలకు తాము ఎల్లప్పుడూ సిద్ధమే అయినా, బలవంతపు ఆంక్షలు, బెదిరింపులతో తమను లొంగదీసుకోవచ్చని భావిస్తే అది అపోహే అవుతుందని



2

## ఖజానా ఖాళీ.. ఉచిత పథకాలే కారణం: తెలంగాణ హైకోర్టు

- ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆందోళన
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో పడుతుందని హెచ్చరిక
- ఖజానా ఖాళీ అవడానికి ఉచితాలే కారణమని వ్యాఖ్య
- కోటీశ్వరులకు రైతుబంధు ఇవ్వడంపై నిలదీత




2

# ప్రపంచం ఎలా మారుతుందో చెప్పలేం.. కానీ, గెలవాలంటే..!

### యువతకు మోదీ కీలక సందేశం

- ఎప్పటికప్పుడు నేర్చుకునేవారే విజయం సాధిస్తారన్న మోదీ
- టెక్నాలజీతో ఉద్యోగాలు, పరిశ్రమలు మారుతున్నాయని వ్యాఖ్య
- యువత నిర్ణయాలు 'వికసిత్ భారత్'పై ప్రభావం చూపుతాయని వెల్లడి
- వచ్చే 30-35 ఏళ్లు యువతకు కీలకమని హితవు
- పరిశోధన, కొత్త ఆలోచనల్లో అవకాశాలు పెరుగుతున్నాయని వెల్ల




ప్రపంచం వేగంగా మారుతోంది.. టెక్నాలజీతో పాటు ఉద్యోగాలు, పరిశ్రమలు కూడా కొత్త రూపం దాలుస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రయాణంలో ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండేవారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని అన్నారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో శనివారం మోదీ ప్రసంగించారు. ప్రపంచంలో వ్యూహాత్మక టెక్నాలజీ మార్పులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

(మిగతా 2వ పేజీలో..)

### మూసీ సుందరీకరణకు తొలి అడుగు..

## ఫేజ్-1కు పర్యావరణ అనుమతులు

- దసరాలోగా టెండర్ల ప్రక్రియకు సిద్ధమవుతున్న ఎంఆర్‌డీసీఎల్
- రూ.7,055 కోట్లతో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు
- పనులు ప్రారంభమైన రెండేళ్లలో ఫేజ్-1 పూర్తి చేయాలని లక్ష్యం



2

### దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి

## రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం: కేసీఆర్ నిర్ణయం

- ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి
- కుటుంబానికి అండగా నిలిచేందుకు కేసీఆర్ కీలక నిర్ణయం



2

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి,

(మిగతా 2వ పేజీలో..)



## మూడేళ్లుగా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదు?



- కేంద్రానికి రాహుల్ గాంధీ ప్రశ్న
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై రిజిజుకు రాహుల్ కౌంటర్
- 2023లోనే బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని వెల్లడి
- మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టొద్దని వ్యాఖ్య
- 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కౌంటర్

(మిగతా 2వ పేజీలో..)

## అభివృద్ధి చేయగానే ప్రజలు ఓట్లు వేయరు..

- నా అనుభవంతో చెబుతున్నా: మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి
- అభివృద్ధికి, ఓట్లకు సంబంధం లేదని కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్య
- తన నియోజకవర్గంలోని ఓ గ్రామంలో జరిగిన అనుభవాన్ని పంచుకున్న వైనం
- కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి చేసినా.. ఎన్నికల్లో మెజారిటీ భారీగా తగ్గిపోయిందని వెల్లడి

(మిగతా 2వ పేజీలో..)



విజయ కెరటం
తెలుగు దిన పత్రిక

## మూడేళ్లుగా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదు?

మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. 2023లోనే కాంగ్రెస్ పూర్తి మద్దతుతో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని గుర్తుచేశారు. మూడేళ్లు గడిచినా చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదు. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లోనే కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది' అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ఎందుకు ముడిపెడుతున్నారని ప్రశ్నించారు. 2023లో ఆమోదించిన చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు.మహిళలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పగలగాలని రాహుల్ ఇటీవల వ్యాఖ్యానించారు. మహిళల సాధికారత రాజకీయాలు, వ్యాపారానికి మాత్రమే పరిమితం కావొద్దని అన్నారు. ఇళ్లు, కుటుంబాలు, బహిరంగ ప్రదేశాల్లోనూ మహిళలకు స్వేచ్ఛ ఉండాలని చెప్పారు. దీనిపై రిజిజు స్పందిస్తూ.. కాంగ్రెస్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు.2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా రూపొందించారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయాలంటూ 2026 ఏప్రిల్‌లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లును తీసుకొచ్చారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ముందుగానే డీలిమిటేషన్ చేపట్టాలని ఇందులో ప్రతిపాదించారు. అయితే లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ రాకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు.

### మూసీ సుందరీకరణకు తొలి అడుగు..

## ఫేజ్-1కు పర్యావరణ అనుమతులు

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న మొదటి దశ (ఫేజ్-1) పనులకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఆగస్టు 5న ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈసీ) జారీ చేసింది. ఈ అనుమతి లభించడంతో, దసరా పండుగలోపే టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కసరత్తు వేగవంతం చేసింది.హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 21 కిలోమీటర్ల మేర 'వి' ఆకారంలో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. దీని కోసం మొత్తం రూ. 7,055 కోట్లు ఖర్చు చేయనుండగా, పనులు ప్రారంభమైన నాటి నుంచి రెండేళ్లలోగా, అంటే 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది.ఈ నిధులతో నదికి ఇరువైపులా 30 మీటర్ల వెడల్పుతో రోడ్లు, సర్వీసు రోడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు, పంపింగ్ స్టేషన్లు, వరద నియంత్రణకు చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేస్తారు. వీటికి తోడు పచ్చటి కారిడార్లు, పార్కులు, సాంస్కృతిక కేంద్రాలను కూడా నిర్మించనున్నారు. నదిలో సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా వర్షాకాలంలో 30 శాతం, ఇతర సమయాల్లో 20 శాతం నీటి ప్రవాహం ఉండేలా చూడనున్నారు.మొదటి దశ కోసం మొత్తం 495 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 158 ఎకరాల ప్రభుత్వ, 146 ఎకరాల పట్టా, 30 ఎకరాల రక్షణ శాఖ భూములతో పాటు 126 ఎకరాల నదీ పరివాహక ప్రాంతం ఉంది. ఈ పరిధిలో 639 శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే 2,660 చెట్లలో చాలావాటిని మరోచోటికి తరలించనున్నట్లు, తప్పనిసరిగా తొలగించాల్సి వస్తే 1:10 నిష్పత్తిలో కొత్త మొక్కలు నాటనున్నట్లు అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. మొత్తం మీద, కీలకమైన పర్యావరణ అనుమతులు లభించడంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు మొదలుకానుండటంతో హైదరాబాద్ మహానగరానికి ఇది కొత్త శోభను తీసుకురానుందని ప్రభుత్వం భావిస్తోంది.

### దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి

## రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం: కేసీఆర్ నిర్ణయం

మొదటి పేజీ తరువాయి)

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం అందించనుండగా, వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేయనున్నారు. పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేసీఆర్ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించిన చర్యలను అమలు అమలు చేస్తారని కేసీఆర్ తెలిపారు

### కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# ప్రపంచం ఎలా మారుతుందో చెప్పలేం.. కానీ, గెలవాలంటే..!

మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి ఈ మార్పులకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాబోయే 20-30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందో కచ్చితంగా చెప్పలేమన్నారు. అయితే మార్పులు సవాళ్లతో పాటు కొత్త అవకాశాలను కూడా తీసుకొస్తాయని తెలిపారు.ప్రస్తుత తరం యువతకు ప్రత్యేక బాధ్యత ఉందని మోదీ అన్నారు. వచ్చే 30-35 ఏళ్లలో వారు తీసుకునే నిర్ణయాలు 'వికసిత్ భారత్' ప్రయాణంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని సూచించారు.పరిశోధన, కొత్త ఆలోచనల్లోనూ యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని మోదీ చెప్పారు. ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ పథకం ద్వారా యువ పరిశోధకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. పరిశోధన రంగానికి రూ.1 లక్ష కోట్ల వరకు నిధులు సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా ప్రముఖ అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ దేశంలోని చిన్న పట్టణాలకూ అదనపు ఖర్చు లేకుండా అందుతున్నాయని మోదీ తెలిపారు. ఐఐటీ ఢిల్లీలో 3,000 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు అందించారు. ఇందులో 587 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు. అదే కార్యక్రమంలో ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరమ్ ప్రజ్ఞ' ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ సదుపాయాన్ని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది ఏఐ, డేటా సైన్స్, ఆధునిక కంప్యూటింగ్, పరిశోధనకు ఉపయోగపడనుంది.

# ఖజానా ఖాళీ.. ఉచిత పథకాలే కారణం: తెలంగాణ హైకోర్టు

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో అమలు చేస్తున్న ఉచిత పథకాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పథకాల వల్ల రాష్ట్రంలో త్వరలోనే తీవ్రమైన ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించింది. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడానికి ఈ ఉచిత పథకాలే ప్రధాన కారణమని జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది.కంటోన్మెంట్ బోర్డుకు సర్‌ఛార్జి బకాయిల చెల్లింపునకు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. "కోటీశ్వరులకు రైతుబంధు, లగ్జరీ బైక్‌లపై తిరిగే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎలా ఇస్తారు?" అని ధర్మాసనం ప్రభుత్వాన్ని నిలదీసింది. "ఉచితాల వల్ల గ్రామాల్లో కూలీలు దొరకక రైతులు ఏడుస్తున్నారు. ప్రజలు కష్టపడి పనిచేసే రోజులను వీడియోల్లో చూసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర జనాభా కన్నా రేషన్ కార్డుల్లో ఉన్న సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది.ఈ కేసులో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా కోర్టుకు హాజరయ్యారు. కంటోన్మెంట్ బోర్డుకు రూ. 25.45 కోట్లు విడుదల చేశామని, మిగతా మొత్తాన్ని వాయిదాల్లో చెల్లిస్తామని ఆయన వివరించారు. ఆయన వివరణతో సంతృప్తి చెందిన ధర్మాసనం, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఇదే విచారణలో భాగంగా, పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లోగా ఈ ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

# అభివృద్ధి చేయగానే ప్రజలు ఓట్లు వేయరు..

మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.. అభివృద్ధి చేస్తే ప్రజలు గెలిపిస్తారా? వారి సమస్యలు తీరిస్తే ఓట్లు వేస్తారా? అనే అంశంపై తన రాజకీయ అనుభవాన్ని రంగరించి ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. అభివృద్ధి చేసినంత మాత్రాన ఎన్నికల్లో గెలుస్తామనుకోవడం పొరపాటని, ఓట్లు మానవ సంబంధాలపై ఆధారపడి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఎదురైన ఒక సంఘటనను ఉదాహరణగా చూపుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తన సొంత నియోజకవర్గమైన పీలేరులోని 'మంచాలమంద' అనే మారుమూల గ్రామం గురించి కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. "ఆ గ్రామానికి 9 కిలోమీటర్ల వరకు సరైన రోడ్డు ఉండేది కాదు. 1989లో ఎమ్మెల్యే అయినా, 2002 వరకు నేను ఆ ఊరికి వెళ్లలేకపోయాను. దాదాపు 800-900 ఓట్లున్న ఆ గ్రామానికి కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. అక్కడ ప్రజలకు సరైన ఇళ్లు, సాగునీటి వసతులు కూడా లేవు" అని నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు.2004లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ఆయన తెలిపారు. "ఆ ఒక్క గ్రామానికే 500 ఇళ్లు మంజూరు చేశాం. 4 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రెండు చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. కోటి రూపాయల ఖర్చుతో 9 కిలోమీటర్ల రోడ్డు వేశాం. దీంతో గ్రామానికి బస్సు సౌకర్యం కూడా వచ్చింది. అంతేకాకుండా, ఎంపీపీ పదవిని కూడా ఆ గ్రామస్థులకే ఇచ్చాం" అని తాను చేసిన అభివృద్ధి పనులను వివరించారు.అయితే, ఎన్నికల ఫలితాలు మాత్రం ఆశ్చర్యపరిచాయని ఆయన అన్నారు. "ఇంత అభివృద్ధి చేయకముందు జరిగిన ఎన్నికల్లో ఆ గ్రామంలో మాకు 300 ఓట్ల మెజారిటీ వచ్చింది. కానీ, ఇన్ని పనులు చేశాక జరిగిన ఎన్నికల్లో కేవలం 30 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది" అని కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. దీనిపై తాము విశ్లేషణ చేసుకోగా అసలు కారణం తెలిసిందన్నారు. "మాతో ఉంటూ ఆ గ్రామానికి చెందిన కొందరు స్థానిక నేతలు ఆర్థికంగా ఎదిగారు. వారిపై మిగిలిన గ్రామస్థుల్లో అసూయ పెరిగింది. మాకు ఓటు వేస్తే ఆ నేతలకు పేరు వస్తుందని భావించిన ప్రజలు, వారిని దెబ్బ తీయాలనే ఉద్దేశంతో నాకు వ్యతిరేకంగా ఓటు వేశారు" అని అసలు విషయం చెప్పారు.రాజకీయాల్లో గెలుపునకు ఫార్ములా ఏమీ ఉండదని, ఇది చేస్తే గెలుస్తాం, అది చేస్తే ఓడిపోతాం అని చెప్పలేమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతిమంగా భగవంతుడి అనుగ్రహం ఉండాలని, రాజకీయాల్లో ఆ భగవంతుడు ఓటరు మహాశయులేనని వ్యాఖ్యానించారు. ఓటర్లు తలచుకుంటేనే గెలుస్తామని, లేదంటే ఓడిపోతామని తన రాజకీయ అనుభవ సారాంశాన్ని ఆయన పంచుకున్నారు.

# చర్చలకు సిద్ధం.. కానీ లొంగిపోయే ప్రసక్తే లేదు: ఇరాన్ అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ దేశాలతో పరస్పర గౌరవంతో కూడిన సంబంధాలనే కోరుకుంటున్నామని, అయితే తమ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.టెహ్రాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "ఇరాన్ ఏ దేశంతోనూ యుద్ధాన్ని గానీ, ఉద్రిక్తతలను గానీ కోరుకోవడం లేదు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధం" అని తెలిపారు. అయితే, చర్చల పేరుతో ఏకపక్ష నిబంధనలు రుద్దాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. "ఆంక్షలు, బెదిరింపుల ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమే అవుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని విస్తరిస్తోందన్న ఆరోపణలతో అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) గత కొన్నేళ్లుగా ఆ దేశంపై కఠిన ఆర్థిక ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడి మరింత పెరుగుతోంది. ఈ క్రమంలో, దేశ ప్రయోజనాల విషయంలో కఠినంగా ఉంటామని పెజెష్కియాన్ అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశం ఇచ్చారు. బాహ్య ఒత్తిడిని తట్టుకునేందుకు స్వయం సమృద్ధి సాధించడం, చైనా, రష్యా వంటి ఆసియా దేశాలతో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తున్నామని అధ్యక్షుడు పెజెష్కియాన్ తెలిపారు. పాశ్చాత్య దేశాలతో ఆంక్షల నుంచి ఉపశమనం కావాలంటే అది సమానత్వ ప్రాతిపదికన జరిగే చర్చల ద్వారానే సాధ్యమవుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# నల్గొండ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం







**నల్గొండ విజయకెరటం**

నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభమైన జిల్లా నీటి పారుదల సలహామండలి సమావేశం. ముఖ్య అతితిగా హాజరైన రోడ్లు,భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.హాజరైన జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎం ఎల్ సి శంకర్ నాయక్,నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి,డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు,మున్సిపల్ చైర్మన్లు,ఇరిగేషన్, రెవెన్యూ,వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు జిల్లాలో వర్షపాతం,గ్రౌండ్ వాటర్ పరిస్థితులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి విస్తరిస్తున్న అధికారులు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో తీసుకోవలసిన చర్య ల పై రూపొందించే కార్యాచరణ ప్రణాళిక పై చర్చ. వర్షపాతాన్ని క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించిన మంత్రి. గ్రౌండ్ వాటర్ ను ఏ విధంగా పెంపొందించుకోవాలో అధికారులు ఆలోచించాలి. జలసిరి ద్వారా గ్రౌండ్ వాటర్ పెంచేలా చూడాలి. ఫార్మ్ పాండ్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టండి. మున్సిపాలిటీ లో ఇంటి పర్మిషన్ కు ఇంకుడు గుంత తప్పనిసరి చేయండి. పడిన ప్రతి వాననీటి చుక్కను వడిసి పట్టేలా అప్రమత్తంగా ఉండాలి .వాల్టా చట్టం పకడ్బందీగా అమలు చేయండి.

# కవితమ్మ ఉక్కు సంకల్పం ముస్లిం మహిళలకుకొత్త దిశ

**తెలంగాణ రాష్ట్రంలో నూతన ఒరవడి కి నాంది మొదలైంది,**

ముస్లిం మహిళలు కూడా అసెంబ్లీకి, పార్లమెంట్‌కు అడుగుపెట్టాలి తెలంగాణ రాజకీయాలకు ఇది కొత్త అధ్యాయం కావాలి అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపు ఇప్పుడు రాజకీయాల్లో కొత్త చర్చ కు దారి తీసింది, రాష్ట్రం నుంచి మహిళలు అసెంబ్లీకి, పార్లమెంట్‌కు మరింత ఎక్కువగా అడుగుపెట్టాలి అనే ఆమె సందేశం కేవలం ఒక వర్గానికే కాదు, అన్ని వర్గాల మహిళలకు వర్తిస్తుంది. ముఖ్యంగా ఇప్పటివరకు రాజకీయాల్లో తక్కువ ప్రాతినిధ్యం పొందిన ముస్లిం మహిళలకు ఇది ఒక ఆశాకిరణంగా కనబడుతోంది, తెలంగాణలో ముస్లిం సమాజం గణనీయమైన జనాభా కలిగి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో సుమారు 12.7% మంది ముస్లింలు ఉన్నారు. ఈ వర్గంలో మహిళలు కూడా దాదాపు సగం వాటాను కలిగి ఉన్నారు. అయినప్పటికీ, రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థలు, ప్రధాన రాజకీయ పార్టీల నిర్ణయాత్మక కమిటీలలో ముస్లిం మహిళల ప్రాతినిధ్యం చాలా పరిమితంగానే ఉంది.ముస్లిం మహిళలు విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం కావాలంటే, వారి గొంతు శాసనసభల్లో,పార్లమెంటు లో వినిపించాలి. నిర్ణయాలు తీసుకునే వేదికలపై వారు ఉండటం ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా మార్చే వీలుంది,భారతదేశం ఇప్పటికే మహిళా నాయకత్వానికి ఎన్నో ఉదాహరణలు చూసింది. రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా మహిళలు సేవలందించారు. అలాగే ముస్లిం మహిళలు కూడా విద్య, న్యాయవృత్తి, పరిపాలన, సామాజిక సేవ, వ్యాపారం వంటి రంగాల్లో తమ ప్రతిభను నిరూపించారు. ఇప్పుడు అదే నాయకత్వం రాజకీయ రంగంలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు రావడంతో వేలాది మహిళలు ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. అదే స్ఫూర్తితో రాజకీయ పార్టీలు కూడా ముస్లిం మహిళలకు టికెట్లు, శిక్షణ, నాయకత్వ అవకాశాలు కల్పిస్తే కొత్త నాయకత్వం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.ముస్లిం మహిళలు రాజకీయాల్లోకి రావడం అంటే ఒక వర్గానికి మాత్రమే ప్రయోజనం కాదు. అది తెలంగాణ ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుంది. సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం, సమాన గౌరవం అనే రాజ్యాంగ విలువలను ఆచరణలోకి తీసుకురావడంలో ఇది కీలక అడుగు అవుతుంది.కాబట్టి సామాజిక న్యాయ సంకల్ప సభలో వినిపించిన మహిళల రాజకీయ భాగస్వామ్య పిలుపును తెలంగాణ సమాజం హర్షించాలి. ముస్లిం యువతులు, మహిళలు విద్యతో పాటు ప్రజాసేవ, నాయకత్వం, రాజకీయాల వైపు ధైర్యంగా ముందుకు రావాలి. మిగతా రాజకీయ పార్టీలు కూడా వారికి తగిన అవకాశాలు కల్పించాలి."ముస్లిం మహిళలు ఓటర్లుగానే కాదు, విధానాలను రూపొందించే నాయకులుగా కూడా ఎదగాలి. అసెంబ్లీ, పార్లమెంట్‌లో వారి స్వరం వినిపించినప్పుడే సామాజిక న్యాయం మరింత సార్థకమవుతుంది. ఇప్పటిదాకా సామాజిక న్యాయం పేరుతో రాజకీయ పార్టీ లు, కొన్ని ప్రజా సంఘాలు సభలు,సమావేశాలు నిర్వహించాయి కానీ సాధనలో మాత్రం వెనుకబడ్డాయి, అయితే చిత్త శుద్ధి,బలమైన విశ్వాసం తో పాటు సిద్ధించిన తెలంగాణలో సామాజిక న్యాయ తెలంగాణ సాధించి తీరాలని కవితమ్మ ప్రతిజ్ఞ బూని ముందుకు సాగడం హర్షణీయం ఎన్నో ఏళ్ళు గా సమాన న్యాయం కోసం, హక్కుల పరిరక్షణ కోసం,సంపూర్ణ తెలంగాణ సాధించబడాలని కోరుకున్న శక్తులకు కవితమ్మ ఉద్యమం ఆశలు నింపుతోంది.



సయ్యద్ ఇస్మాయిల్
తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు

## వివాహిత మృతిపై అనుమానం.. ఎస్పీ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా



కనగల్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వివహిత ఉరి వేసుకొని చనిపోయినది, ఈ విషయం కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి మార్చురి గదిలో భద్రపరిచారని తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తమ కూతురు మృతి పై అనుమానం ఉందని పిర్యాదు చేయడానికి కనగల్ పోలీస్ స్టేషన్ కు వెళితే ఎస్ ఐ మా పిటిషన్ ను పట్టించుకోకుండా పెద్దమనుషుల సమక్షంలో కూర్చొని మాట్లాడుకొమ్మని ఫోన్ లు చేస్తున్నాడని మీడియా కు తెలిపారు, తమకుతురును చంపి ఉరి వేశారాని కనగల్ ఎస్ ఐ కి తమ గోడు చెప్పిన వింటలెడని శనివారం నల్లగొండ జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు కుటుంబ సభ్యులు దర్న కు దిగారు మృతురాలికి ఒక పాపా, బాబు ఉన్నారు, తమ కూతురు మృతి పై అనుమానం ఉందని బాద్యులపై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలనీ ఎస్పీ గారిని కోరుతున్నామని మీడియా కు తెలియజేశారు

## బెంగళూరులో ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశం ప్రారంభం





కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని బెంగుళూరు గేట్ హోటల్ లో ఆగస్టు 8,9 తేదీలలో జరుగుతున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(IJU) జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ప్రారంభించిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ది వైర్ మీడియా సంస్థ వ్యవస్థాపకులు సిధార్థ్ వరదరాజన్ లు. ఐజేయు అధ్యక్షులు బల్విందర్ సింగ్ జమ్ము అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మీడియా అకాడమీ చైర్మన్లు కె. శ్రీనివాస్ రెడ్డి, అంజూమ్ ఖన్నన్, ఐజేయు ప్రధాన కార్యదర్శి డి. సోమసుందర్, జాతీయ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, ఎస్.ఎన్. సిన్హాలతో పాటు 23రాష్ట్రాల జర్నలిస్ట్ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జాతీయ కార్యవర్గం పాల్గొంది.

## వైభవ్ సూర్యవంశీని చూసి ధావన్ ఫిదా.. ఆ ఒక్క లక్షణమే కారణమట!

యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసలు కురిపించారు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమని అన్నారు. షాట్లు ఆడే నైపుణ్యం ఉండటం ఒకటైతే.. వాటిని ఆడే ధైర్యం ఉండటం మరో విషయమని చెప్పారు."వైభవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. 15 లేదా 16 ఏళ్లకే అంతర్జాతీయ స్థాయికి చేరడం చాలా గొప్ప విషయం. ఐపీఎల్‌లోనూ అతడు అద్భుతంగా ఆడాడు. ఫోర్లు, సిక్సర్లు కొట్టే విధానం ఆకట్టుకుంటోంది. నైపుణ్యం ఉండటం ఒక విషయం. కానీ 15 ఏళ్ల వయసులోనే ఆ షాట్లు ఆడే ధైర్యం ఉండటం చాలా ప్రత్యేకం" అని ధావన్ అన్నారు.ఇటీవల జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల్లో వైభవ్ 151 పరుగులు చేశాడు. దీంతో తొలిసారి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు అందుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 3-0తో గెలిచింది. అంతకుముందు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్.. టీమిండియా తరఫున ఆడిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు.ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్ 776 పరుగులు చేశాడు. 237.30 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఒక సెంచరీ, ఐదు అర్థ సెంచరీలు సాధించాడు. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. ఎమర్జింగ్ ప్లేయర్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ సహా పలు అవార్డులు గెలుచుకున్నాడు. అండర్-19 ప్రపంచకప్‌లోనూ 439 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచాడు.ఇదిలా ఉండగా.. ధావన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని పితంపురలో ఓ పాఠశాలలో రాజీవ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితంపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే దీని లక్ష్యం. ఈ ల్యాబ్‌తో 2,500 మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. డిజిటల్ విద్యా కార్యక్రమాల ద్వారా ఇప్పటికే 50 వేల మంది పిల్లలకు తమ ఫౌండేషన్ చేరువైందని ధావన్ తెలిపారు.





